# ప్రజా సమస్యలపై పోరాడుతాం



రాయికల్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

- ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తా
- జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్
- రాయికల్‌లో ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం

రాయికల్, డిసెంబర్ 12: ప్రజా సమస్యలపై నిత్యం పోరాడుతూ ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందేలా చూస్తానని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. రాయికల్ పట్టణంలోని వర్తక సంఘం గార్డెన్‌లో మంగళవారం రాయికల్ మండల, పట్టణ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రాకున్నా అధైర్య పడవద్దని, నియోజకవర్గంలోని కార్యకర్తలకు అను నిత్యం తాను అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ప్రజా సమస్యలపై పోరాడుతూ ప్రజలకు ప్రభుత్వం ద్వారా పథకాలు అందే విధంగా చూస్తానని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రజలకు అందే విధంగా బీఆర్ఎస్ కార్యకర్తలు పోరాడాలన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, ఎంపీపీ సంధ్యారాణి, జడ్పీటీసీ జాదవ్ అశ్విని, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రాణి, వైస్ చైర్మన్ రమాదేవి, వైస్ ఎంపీపీ మహేశ్వర్ రావు, పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు కోల శ్రీనివాస్, ఇంతియాజ్, సింగిల్ విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, నాయకులు రాజారెడ్డి, మోహన్ రావు, సర్పంచులు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### బాధిత కుటుంబాలకు పరామర్శ

మండలంలో ఇటీవల మరణించిన పలువురు బాధిత కుటుంబాలను జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మంగళవారం పరామర్శించారు. రామోజీపేట గ్రామానికి చెందిన జకిలేటి కిషన్ రావు అనారోగ్యంతో మరణించగా, యువ నాయకుడు సృజన్ రెడ్డి తాత బడుగం భూమన్న అనారోగ్యంతో మరణించగా వారివారి కుటుంబ సభ్యులను, బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీ ఉప సర్పంచ్ కురుమ లింగారెడ్డి అమ్మ మరణించగా వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. అలాగే చెర్లకొండాపూర్ బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు దేవుని రవి తల్లి, మాజీ సర్పంచ్ దేవుని నర్సమ్మ అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట పార్టీ మండలాధ్యక్షుడు కోల శ్రీనివాస్, సర్పంచ్ రమాదేవి-మోహన్, ఉప సర్పంచ్ హరీశ్ రావు, ఏఎంసీ డైరెక్టర్ కోల రాజు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యేకు కిష్టంపేట గ్రామస్తుల శుభాకాంక్షలు

జగిత్యాల ఎమ్మెల్యేగా డాక్టర్ సంజయ్ కుమార్ రెండో సారి విజయం సాధించి ప్రమాణ స్వీకారం చేసి కిష్టంపేట గ్రామానికి మొదటిసారి వచ్చిన సందర్భంగా మంగళవారం బీఆర్ఎస్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తనకు ఓటు వేసి గెలిపించినందుకు నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు, కార్యకర్తలు ప్రజ లు తదితరులు పాల్గొన్నారు.

## రోళ్ల వాగు పనులను పూర్తి చేయాలి

- ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి
- ప్రాజెక్ట్ పరిశీలన.. అధికారులకు పలు సూచనలు



బీర్‌పూర్ మండలంలో రోళ్ల వాగు ప్రాజెక్ట్‌ను పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

సారంగాపూర్, డిసెంబర్ 12: రోళ్లవాగు ప్రాజెక్ట్ ఆధునీకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎస్సారెస్పీ అధికారులను ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం బీర్‌పూర్ మండల కేంద్రం శివారులోని రోళ్లవాగు ప్రాజెక్ట్‌ను సందర్శించి ఆధునీకరణ పనులను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, రోళ్ల వాగు ప్రాజెక్ట్‌కు షటర్లు బిగించాలని అధికారులకు సూచించారు. ఈ పంటకు సాగునీరందేలా చర్యలు తీసుకోవాలన్నారు. డిసెంబర్ 15 నుంచి నీరు ఇవ్వాలని అధికారులకు సూచించామని అన్నారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా ఎట్టి పరిస్థితుల్లో డిసెంబర్ 17 వరకు నీళ్లు విడుదల చేయిస్తామని అన్నారు. 15వ తేదీ లోపు సీఎం రేవంత్ రెడ్డిని కలిసి సమస్యను వివరించి తప్పకుండా 17 నుంచి నీటిని విడుదల చేయిస్తామన్నారు. అలాగే సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లోని ప్రతి గ్రామానికి వేసవిలో తాగు నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రైతులు ఎలాంటి ఆందోళన పడాల్సిన పనిలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ.7500 పెట్టుబడి సహాయం అందిస్తుందన్నారు. ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం ఏటా రూ.12 వేలు ఇస్తుందని ప్రకటించగా దానికి మరో రూ.1500 కలిపి ప్రతినెలా రూ.2500 వచ్చే విధంగా కృషి చేస్తామన్నారు. బీర్‌పూర్‌లోని పిల్లర్‌బెడ్ మరమ్మతులకు నిధులు అంచనాలు వేయించి త్వరలోనే వినియోగంలోకి తెస్తామన్నారు. అనంతరం బీర్‌పూర్ మండల పరిషత్ కార్యాలయంలో మండల అభివృద్ధిపై ప్రజాప్రతినిధులు, అధికారులతో చర్చించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ మసర్తి రమేశ్, జడ్పీటీసీ పాత పద్మ-రమేశ్, వైస్ ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్ రావు, డీఈ చక్రునాయక్, ఎంపీడీవో రాజేందర్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

### జాతీయస్థాయి పోటీలకు జ్యోతి విద్యార్థులు

జగిత్యాల, డిసెంబర్ 12: జిల్లా కేంద్రంలోని జ్యోతి హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు డిసెంబర్ 9, 10వ తేదీల్లో వరంగల్‌లోని జీడబ్ల్యూఎంసీ ఇండోర్ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి ఓపెన్ కిక్ బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో ప్రతిభ చూపి జనవరి 21, 2024లో జరిగే జాతీయస్థాయి ఖేలో ఇండియా పోటీలకు ఎంపికయ్యారు. జ్యోతి హైస్కూల్‌కు చెందిన 5వ తరగతి విద్యార్థిని విష్ణువర్ధినికి బంగారు పతకం, జ్యోతినాథ్, బద్రినాథ్, సహస్ర, ఎండీ సుమైర్, వర్షిక్‌కు కాంస్యం, విశాల్, అర్హమొద్దీన్ రజత పతకాలు సాధించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ బియ్యాల హరిచరణ్ రావు, మాస్టర్ రామాంజనేయులు పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు శ్రీధర్ రావు, మౌనికారావు, అజిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మల్యాల, డిసెంబర్ 12: నూకపల్లి శివారులోని వీఆర్‌కే కళాశాలకు సమీపంలో జగిత్యాల-కరీంనగర్ ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంతో ఓ యువకుడు మృతి చెందినట్లు మల్యాల ఎస్ఐ-2 కుమారస్వామి తెలిపారు. ఎస్ఐ కుమారస్వామి తెలిపిన వివరాల ప్రకారం, కొడిమ్యాల మండలంలోని డబ్బుతిమ్మాయపల్లి గ్రామానికి చెందిన భూమాచారి (28) తన ద్విచక్రవాహనంపై వస్తున్న క్రమంలో రోడ్డు ప్రమాదం జరిగిందన్నారు. దీంతో ద్విచక్రవాహనం నడుపుతున్న భూమాచారి అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని పరిశీలించడంతో పాటు భూమాచారిని ఏదైనా వాహనం ఢీకొట్టి వెళ్లిందా..? లేదా తనకు తానుగా ద్విచక్ర వాహనం అదుపు తప్పి పడ్డాడా..? అనే కోణంలోనూ పరిశీలిస్తున్నామన్నారు. భూమాచారి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

### ఇటిక్యాల వాసికి డాక్టరేట్ ప్రదానం



పట్టాను అందుకుంటున్న మల్లారెడ్డి

రాయికల్, డిసెంబర్ 12: ఇటిక్యాల గ్రామానికి చెందిన నల్లపు మల్లారెడ్డి రసాయన శాస్త్ర విభాగంలో చేసిన పరిశోధనలకు శాతవాహన విశ్వావిద్యాలయం మంగళవారం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. మల్లారెడ్డి సింథసిస్ ఆఫ్ న్యూమలిక్యులార్ హైబ్రిడ్స్ కంటైనింగ్ ట్రై అజోల్ ఫార్మకో ఫోర్ అండ్ దెర్ యాంటీ క్యాన్సర్ ఎవల్యూయేషన్ అనే అంశంపై రసాయన శాస్త్ర విభాగ, సహాచార్యులు డాక్టర్ ఏ జయంతి ప్రిన్సిపాల్, సైన్స్ కళాశాల పర్యవేక్షణలో చేసిన విశిష్ట పరిశోధనకు డాక్టరేట్ డిగ్రీని అందజేసినట్లు అయన వివరించారు. నల్లపు మల్లారెడ్డిని విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య మల్లేశ్ సంకసాల, రిజిస్ట్రార్ ఆచార్య వరప్రసాద్, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ వీ నమ్రత, వివిధ విభాగాల అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది, కుటుంబ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

### సంతకం ఫోర్జరీ చేసిన వ్యక్తిపై కేసు

కథలాపూర్, డిసెంబర్ 12 : పోతారం గ్రామంలో పంచాయతీ కార్యదర్శి సంతకం ఫోర్జరీ చేసిన బండి రాజగంగారాంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ మంగళవారం తెలిపారు. గ్రామంలో పంచాయతీ కార్యదర్శి సంతకం ఫోర్జరీ చేసి ఇంటి ఓనర్‌షిఫ్ సర్టిఫికెట్ తయారు చేసిన విషయంలో ఇటీవల వివాదం జరిగింది. దీనిపై ఉన్నతాధికారులు విచారణ జరిపారు. బండి రాజగంగారాం కార్యదర్శి సంతకం ఫోర్జరీ చేసినట్లు తేలిందని ఎస్ఐ అన్నారు. పంచాయతీ కార్యదర్శి రాజేశ్ పిర్యాదు మేరకు బండి రాజగంగారాంపై కేసు నమోదు చేశామన్నారు.

### పిల్లలతో భిక్షాటన చేయిస్తే కఠిన చర్యలు: ఎస్పీ

జగిత్యాల కలెక్టరేట్, డిసెంబర్ 12: పిల్లలతో బిక్షాటన చేయించడం, అపహరించి వ్యభిచారంలోకి దింపడం, విక్రయించడం, బంధించి బలవంతంగా పనులు చేయించడం, అక్రమ పద్ధతుల్లో దత్తత తీసుకోవడం, అవయవాల విక్రయలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ హెచ్చరించారు. అక్రమ రవాణా చేసే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. మానవ అక్రమ రవాణా నిరోధానికి యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేశామని, మానవ అక్రమ రవాణా జరుగకుండా జిల్లాలో పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మానవ అక్రమ రవాణాపై సమాచారం ఉంటే ప్రజలు 8712656810 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. తప్పిపోయిన, వదిలివేయబడిన పిల్లలు, బాలికలను గుర్తించి వారి తల్లిదండ్రులకు అప్పగించి తగిన విధంగా కౌన్సెలింగ్ ఇస్తామన్నారు.

### గ్యాస్ కనెక్షన్‌కు ఈకేవైసీపై ఆందోళ న చెందవద్దు

పెగడపల్లి, డిసెంబర్ 12: ఎల్‌పీజీ గ్యాస్ కనెక్షన్‌కు సంబంధించి ఈకేవైసీ చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఎలాంటి గడువు విధించలేదని, దీనిపై గ్యాస్ వినియోగదారులు ఆందోళన చెందవద్దని పెగడపల్లి మండల భారత్ గ్యాస్ డీలర్ గొల్లపల్లి శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.500 సిలిండర్ కోసం ఈకేవైసీ చేయించుకోవాలని సోషల్ మీడియాలో వస్తున్న వార్తలపై గ్యాస్ వినియోగదారులు పెద్ద ఎత్తున మండల కేంద్రంలోని గ్యాస్ ఏజెన్సీ వద్దకు వస్తున్నారని, దీని వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. రూ.500కే గ్యాస్ కనెక్షన్‌పై రాష్ట్ర ప్రభుత్వం ఇంకా ఎలాంటి ప్రకటన చేయలేదని, కేంద్ర ప్రభుత్వం మృతులు, ఇతరుల పేరుతో గ్యాస్ కనెక్షన్లు ఉన్నట్లు గుర్తించినందున, వాటిని సవరించేందుకే ఈకేవైసీ చేసుకోవాలని పేర్కొన్నదని తెలియజెప్పారు.

### కోరం లేక మండల సర్వ సభ్య సమావేశం వాయిదా

వెల్గటూర్, డిసెంబర్ 12: తగిన కోరం లేక మండల సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేసినట్లు ఎంపీపీ కునమల్ల లక్ష్మి ప్రకటించారు. సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు నిర్వహించాల్సి ఉండగా మధ్యాహ్నం 12.30 గంటల వరకూ 15 మంది ఎంపీటీసీ సభ్యులకు వైస్ ఎంపీపీతో కలిపి నలుగురు మాత్రమే హాజరు కావడంతో స మావేశాన్ని కోరం లేక వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. రాజారాంపల్లి గాజుల మల్లేశం, వెల్గటూర్ ఎంపీటీసీ పెద్దూరి హారిక, ముక్కట్రావుపేట ఎంపీటీసీ మూగల రాజేశ్వరి, మరికొందరు సర్పంచులు హాజరయ్యారు. అనంతరం సభ్యులు సమావేశానికి హాజరు కాకపోవడంపై కొత్తపేట సర్పంచ్ కొమ్ము రాంబాబు ఎంపీడీవో కార్యాలయం ఎదుట నేలపై కూర్చొని నిరసన తెలిపారు.

### లింగాపూర్ గ్రామ ఇన్‌చార్జి సర్పంచ్‌గా హారిక



హారిక

పెగడపల్లి, డిసెంబర్ 12: లింగాపూర్ గ్రామ ఇన్‌చార్జి సర్పంచ్‌గా బాల్సాని హారిక-శేఖర్ నియమితులయ్యారు. ఇంత వరకు గ్రామ సర్పంచ్‌గా ఉన్న ఈరెల్లి శంకర్ నవంబర్ 15న గుండెపోటుతో మృతి చెందాడు. సర్పంచ్ శంకర్ మృతి చెందడంతో, జిల్లా పంచాయతీ అధికారులు ఉప సర్పంచ్ హారికను ఇన్‌చార్జి సర్పంచ్‌గా నియమించారు. బుధవారం పంచాయతీ పాలక వర్గం ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీలో సమావేశం ఏర్పాటు చేసి, ఉప సర్పంచ్ హారికకు సర్పంచ్‌గా బాధ్యతలు అప్పగించడంతో పాటు, పాలక వ ర్గం అనుమతితో సర్పంచ్‌తో జాయింట్ చెక్ పవర్ కోసం ఓ వార్డు సభ్యుడి ని ఎంపిక చేయనున్నట్లు ఎంపీవో మహేందర్, కార్యదర్శి లావణ్య చెప్పారు.

### పెగడపల్లిలో అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

పెగడపల్లి, డిసెంబర్ 12: మండల కేంద్రంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను మండల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహేశ్వరి మంగళవారం తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార నిలువలకు సంబంధించిన రికార్డులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాలను సక్రమంగా నిర్వహించడంతో పాటు, కేంద్రాలకు 3 నుంచి 5 సంవత్సరాలలోపు చిన్నారులు వచ్చే విధంగా చూడాలని, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారాలను అందించాలని సూచించారు.

### బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

మల్లాపూర్, డిసెంబర్ 12: మండల కేంద్రానికి చెందిన గొట్టిపడ్త రాజు జీవనోపాధి కోసం కొంత కాలం కిందట గల్ఫ్ దేశమైన సౌదీ అరేబియా వెళ్లి అక్కడ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అక్కడి నుంచి స్వదేశానికి రప్పించడం కోసం తమ వంతుగా టాకీస్ అడ్డా మిత్ర మండలి సభ్యులు రూ. 10 వేలు నగదును బాధిత కుటుంబ సభ్యులకు మంగళవారం అందజేసి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. ఇక్కడ సభ్యులు మనోజ్, శివ, విష్ణు, వినోద్, హరీశ్, సురేశ్, రాకేశ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

### పేకాట స్థావరంపై సీసీఎస్ పోలీసుల దాడి

జగిత్యాల కలెక్టరేట్, డిసెంబర్ 12: పట్టణ శివారులో పేకాట స్థావరంపై మంగళవారం సాయంత్రం పోలీసులు దాడి చేసి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ. 23,600 నగదు స్వాధీనం చేసుకున్నామని సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ శివారులో కొందరు పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారంతో సీసీఎస్ సిబ్బందితో దాడి చేసి పట్టుకున్నామని చెప్పారు.